# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 19, జులై 2026


### కెనాల్ మరమ్మతులు వేగవంతం చేసి

## రైతులకు సకాలంలో సాగునీరు అందించాలి

**ఆసిఫాబాద్, జూలై 18, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోవ లక్ష్మి శనివారం వట్టివాగు ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు, కెనాల్ పరిస్థితి, మరమ్మతు పనుల పురోగతి, సాగునీటి పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా వట్టివాగు ప్రధాన కెనాల్ మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి వరి సాగు చేస్తున్న రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం జరిగితే రైతులు నష్టపోయే అవకాశం ఉన్నందున ప్రతి దశను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో నమోదవుతున్న వర్షపాతాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రాజెక్టు గేట్లు, కెనాల్లు, నీటి ప్రవాహ మార్గాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ భారీ వర్షాల వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి సాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పంటల సాగుకు అవసరమైన నీటిని సకాలంలో అందించడం ద్వారా రైతులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. క్షేత్రస్థాయిలో రైతులతో మిగతా 2లో..



### వరద ముంపు ప్రాంతంలో..



## పీహెచ్‌సీ స్థల పరిశీలన..!



వరద ప్రభావిత ప్రాంతంలో ఏర్పాటు చేసిన పీహెచ్‌సీ భూమిపూజ శిలాఫలకం

- గతంలో 60 కుటుంబాలను తరలించిన చోటే ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి చర్యలు
- రూ.1.43 కోట్లతో భూమిపూజ.. అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం

**చింతలమానేపల్లి, జూలై 18, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని వరద ముంపు ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) నిర్మాణానికి స్థల పరిశీలన చేసి భూమిపూజ చేయడం ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో భారీ వర్షాలకు వాగు ఉప్పొంగి వరదలు సంభవించడంతో, నివాసయోగ్యం కాదని భావించి సుమారు 60 కుటుంబాలను అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలించారు. అయితే, ప్రజలు ఉండటానికే వీల్లేని అదే ప్రాంతంలో ప్రస్తుతం పీహెచ్‌సీ నిర్మాణానికి అధికారులు స్థలాన్ని ఎంపిక చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2లో..

## గంటల వ్యవధిలోనే హత్య కేసు ఛేదన

- నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

**రెబ్బెన, జూలై 18, ప్రభాతవార్త:**

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన పోలీస్ స్టేషన్ పరిధిలో అసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన మసాడే సోమయ్య హత్య కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. రెబ్బెన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. సంజయ్ తెలిపిన వివరాల ప్రకారం, జూలై 17న పర్సనంబాల గ్రామానికి చెందిన మిగతా 2లో..



## ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన భోజనం, విద్య అందించాలి

- మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత: కలెక్టర్ భవేశ్ మిశ్రా
- నర్సాపూర్ (జి), భైంసా మండలాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు..
- గడ్డెన్న వాగు ప్రాజెక్టు పరిశీలన

**నిర్మల్, జులై 18, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే పాఠశాలల్లో ప్రాథమిక సౌకర్యాలు, పరిశుభ్రత తప్పనిసరి అని పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ భవేశ్ మిశ్రా నర్సాపూర్ (జి), భైంసా మండలాల్లో పర్యటించారు. నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదుల్లో వసతులు, బోధనా స్థాయిని పరిశీలించారు. పాఠశాల రిజిస్టర్లను తనిఖీ చేసి, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు వివరాలను సేకరించారు. అన్ని రిజిస్టర్లను క్రమం తప్పకుండా, పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రోజూ సమయానికి హాజరయ్యేలా చూడాలన్నారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేలా చర్యలు తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాఠశాల ఆవరణను శుభ్రంగా మిగతా 2లో..



# వరద ముంపు ప్రాంతంలో.. పీహెచ్‌సీ స్థల పరిశీలన..!

(మొదటిపేజీ తరువాయి)

మండల కేంద్రం ఏర్పాటుకు ముందు 2008, 2013 సంవత్సరాల్లో కురిసిన భారీ వర్షాల సమయంలో చింతలమానేపల్లి మండల కేంద్రంతో పాటు బాబాసాగర్ గ్రామాన్ని ఆనుకుని ఉన్న వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో చింతలమానేపల్లిలోని హేటిగూడ, బాబాసాగర్ బెస్తవాడ కాలనీల్లోకి వరదనీరు చేరి పలు ఇళ్లు నీటమునిగాయి. ముఖ్యంగా హేటిగూడ ప్రాంతం ఇసుక మేటలు వేసి పూర్తిగా దెబ్బతినడంతో అక్కడ నివసిస్తున్న సుమారు 60 కుటుంబాలను 2009 లో అధికారులు ఇతర ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించారు. కానీ, ఇప్పుడు అదే ప్రాంతంలో రూ.1.43 కోట్ల అంచనా వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించేందుకు స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ మేరకు శనివారం అధికారులు స్థల పరిశీలన నిర్వహించి భూమిపూజ కార్యక్రమం కూడా పూర్తి చేయడం గమనార్హం.

### రహదారులకే గ్యారంటీ లేదు.. ఆసుపత్రి ఎలా కడతారు?

సమీపంలోని ప్రాజెక్టు నిర్మాణం 2010లో పూర్తయినప్పటికీ, 2013 నాటి భారీ వర్షాలకు వరద ఉధృతి కారణంగా ప్రధాన రహదారి సైతం కోతకు గురైందని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఉప్పొంగిన వాగు నీరు కాలనీల వైపు ప్రవహించడంతో రహదారికి భారీ నష్టం వాటిల్లింది. భవిష్యత్తులో మళ్లీ భారీ వర్షాలు కురిసి వాగు ఉప్పొంగితే పీహెచ్‌సీకి వచ్చే రోగులతో పాటు వైద్య సిబ్బంది ప్రాణాలు సైతం ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సురక్షిత ప్రాంతానికి మార్చాలి..

ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇలాంటి వరద ప్రభావిత ప్రాంతంలో నిర్మించడానికి స్థలాన్ని ఎలా ఎంపిక చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పీహెచ్‌సీ నిర్మాణానికి ముందే వరద ముంపు పరిస్థితులు, భూమి భద్రత, భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదాలను అధికారులు సమగ్రంగా పరిశీలించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితమైన ప్రత్యామ్నాయ ప్రాంతంలో నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం ప్రాతినిధ్యం కల్పించాలి

**- జనాభా నిష్పత్తికి అనుగుణంగా అవకాశాలు ఇవ్వాలని డిమాండ్**

**- న్యాయం జరగకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరిక**

మంచిర్యాల, జూలై 18, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పదవుల్లో వెనుకబడిన తరగతులకు 50 శాతం అవకాశాలు కల్పించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. గతంలో చేపట్టిన నామినేటెడ్ పదవుల నియామకాల్లో బీసీలకు తగిన ప్రాధాన్యం దక్కలేదని, తాజాగా ఖాళీ అయిన 50 నామినేటెడ్ పదవుల్లో కనీసం 30 పదవులను బీసీలకు కేటాయించాలని నాయకులు కోరారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56 శాతం ఉన్నప్పటికీ, నామినేటెడ్ పదవుల్లో వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రాతినిధ్యం కల్పించకుండా అరకొర అవకాశాలతో సరిపెట్టడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సంఘాల తరఫున నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలని పలుమార్లు ప్రభుత్వాన్ని కోరినా ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీలో బీసీలకు న్యాయం చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మచర్ల సదానందం, శాఖపురం భీమేశ్, చంద్రగిరి చంద్రమోళి, అంకం సతీష్, గోనె రాజు, భీమేశ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## నేడు మంచిర్యాలలో విద్యా సంబరాలకు శ్రీకారం

### ఘనంగా ఆల్ఫోర్స్ ఆరంభ్ వేడుకలు

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 18, ప్రభాతవార్త

తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఐఐటీ, నీట్ వంటి అత్యున్నత పోటీ పరీక్షల కోచింగ్‌లో విశిష్ట గుర్తింపు పొందిన ఆల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ జూనియర్ కాలేజెస్ మరోసారి విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని నింపేందుకు సిద్ధమైంది. ఖఆరంభ్" పేరుతో నిర్వహించనున్న ఈ ప్రత్యేక స్వాగత వేడుకలు జూలై 19న మంచిర్యాలలో అంగరంగ వైభవంగా జరగనున్నాయి. కొత్త విద్యా సంవత్సరానికి శ్రీకారం చుడుతూ విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, లక్ష్యసాధన దృక్పథం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. ఆరంభ్ కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాకుండా, విద్యార్థుల జీవితంలో కొత్త ఆశయాలకు, విజయాలకు నాంది పలికే మహోత్సవంగా నిలవనుందని పేర్కొన్నారు. ఈ వేడుకలకు ఆల్ఫోర్స్ సంస్థ చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం అందించనున్నారు. ఆయన ప్రసంగం ద్వారా ఐఐటీ, నీట్ లక్ష్యంగా ముందుకు సాగే విద్యార్థులకు స్పష్టమైన దిశానిర్దేశం లభిస్తుందని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృుృతిక ప్రదర్శనలు, సంగీత వినోదం, ప్రేరణాత్మక సెషన్లు, విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించే కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికితీయడానికి, భవిష్యత్తు లక్ష్యాలను నిర్ధేశించుకోవడానికి ఈ వేదిక ఉపయోగపడనుంది. మంచిర్యాల కాలేజ్ రోడ్డులోని పద్మనాయక కళ్యాణ మండపంలో నిర్వహించనున్న ఈ మహోత్సవానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో హాజరవ్వాలని ఆల్ఫోర్స్ యాజమాన్యం ఆహ్వానం పలికింది. ఖలెట్స్ స్టార్ట్ ది సెలబ్రేషన్స్ ఆఫ్ జాయ్" అనే నినాదంతో సాగనున్న ఈ కార్యక్రమం విద్యార్థుల జీవితంలో మరచిపోలేని క్షణాలను అందించనుందని పేర్కొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి ఎద్దు మృతి: తీవ్ర ఆవేదనలో రైతు

**- గతంలోనే ఫిర్యాదు చేసినా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు**

**- రూ.70 వేల నష్టం.. నష్టపరిహారం అందించాలని డిమాండ్**

కోటపల్లి, జూలై 18 ప్రభాతవార్త



మండలంలోని రొయ్యలపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ పాడి పశువు ప్రాణం కోల్పోయింది. శనివారం ఉదయం గ్రామానికి చెందిన రైతు దాగామ రాజమల్లు తన ఎద్దును మేత కోసం తోలుకెళ్తుండగా, స్థానిక ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఉన్న ఎర్త్ వైర్‌కు ప్రమాదవశాత్తు కరెంట్ సరఫరా కావడంతో అది తగిలి ఎద్దు అక్కడికక్కడే మరణించింది. వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న తరుణంలో, సాగుకు ఆధారమైన ఎద్దు మృతి చెందడంతో రైతు రాజమల్లు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నాడు. గతేడాది రూ. 70 వేలు పెట్టి ఈ ఎద్దును కొనుగోలు చేశానని, ఇప్పుడు సాగు ఎలా చేయాలో అర్థం కావడం లేదని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారుల నిర్లక్ష్యమే కారణం ఈ ట్రాన్స్ ఫార్మర్ వద్ద గత రెండు నెలల క్రితం కూడా ఎర్త్ లోపం వల్ల హై వోల్టేజ్ కరెంట్ సరఫరా అయిందని, దీంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారని స్థానికులు తెలిపారు. పెద్ద ప్రమాదం జరగక ముందే తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని గ్రామ యువకులు లైన్‌మెన్ శ్రీధర్‌కు గతంలోనే రాతపూర్వకంగా వినతిపత్రం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యమే నేడు మూగజీవి ప్రాణం తీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధిత రైతు కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.


## మారపల్లిలో భూమి సమగ్ర సర్వేపై అవగాహన సదస్సు

**- రైతుల సందేహాలకు అధికారులు సమాధానాలు**

**- బీఎల్‌ఓలతో ఎస్ఐఆర్‌పై సమీక్ష - గ్రామస్తులకు మొక్కల పంపిణీ**

కాగజ్‌నగర్ రూరల్, జూలై 18, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ మండలంలోని మారపల్లి గ్రామంలో శనివారం భూమి సమగ్ర సర్వే (రీసర్వే)పై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సదస్సులో రైతులు భూమి సమగ్ర సర్వేకు సంబంధించిన పలు సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మధుకర్ మాట్లాడుతూ భూ రికార్డులను ఖచ్చితంగా రూపొందించడం, భూ సరిహద్దులపై వివాదాలను తగ్గించడం, ప్రభుత్వ రికార్డులను ఆధునీకరించడం భూమి సమగ్ర సర్వే ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ప్రతి రైతు సర్వే ప్రక్రియలో అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) గోపాల్, సర్వేయర్ మనిరాజు, జీపీఓ శ్రీ రాజన్న, గ్రామ సర్పంచ్ సుర్పం రాంచెందర్, గ్రామ కార్యదర్శి రాజేశ్వర్‌తో పాటు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ మధుకర్

## కెనాల్ మరమ్మతులు వేగవంతం చేసి రైతులకు సకాలంలో సాగునీరు అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

నిరంతరం సంప్రదింపులు జరుపుతూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రాజెక్టు పరిధిలో కొనసాగుతున్న మరమ్మతు పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి సాగునీటి వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన మండల సింగిల్ విండో చైర్మన్ సంజీవ్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గంటల వ్యవధిలోనే హత్య కేసు ఛేదన

(మొదటిపేజీ తరువాయి)

మసాడే సోమయ్య (65) తన భార్య, చిన్న కుమార్తెతో కలిసి పెద్ద కుమార్తెను హైదరాబాద్‌కు రైలులో పంపించేందుకు అసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైలు కోసం వేచి ఉన్న సమయంలో టీ తాగేందుకు స్టేషన్ బయటకు వెళ్లాడు.ఈ సమయంలో అక్కడే ఉన్న తుంగేడ గ్రామానికి చెందిన బోగరపు నగేష్ (40) మృతుడి వద్ద ఉన్న డబ్బులను గమనించి డబ్బులు ఇవ్వాలని కోరాడు. సోమయ్య నిరాకరించడంతో ఆగ్రహానికి గురైన నగేష్ తన వద్ద ఉన్న గొడ్డలితో దాడి చేసి సోమయ్యను హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు.సమాచారం అందుకున్న వెంటనే రెబ్బెన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఆసిఫాబాద్ డీఎస్పీ బి. అశోక్ పర్యవేక్షణలో రెబ్బెన సీఐ ఎం. సంజయ్, ఎస్ఐ ఏ. వెంకటకృష్ణ, తిర్యాణి ఎస్ఐ పి. సుబ్బారావు తదితరులతో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడి కదలికలను గుర్తించిన పోలీసులు సిర్పూర్(టి) రైల్వే స్టేషన్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు మద్యం అలవాటుకు బానిసై డబ్బుల కోసం ఈ దారుణానికి పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్టు చేసిన దర్యాప్తు బృందాన్ని జిల్లా ఎస్పీ నితిక పంత్ అభినందించారు.

## ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన భోజనం, విద్య అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో మొక్క నాటిన కలెక్టర్.. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు.

### మరుగుదొడ్ల సముదాయం, గడ్డెన్న వాగు ప్రాజెక్టు పరిశీలన

అనంతరం నర్సాపూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సామూహిక మరుగుదొడ్ల సముదాయాన్ని కలెక్టర్ పరిశీలించి, నిర్మాణ పనులు, వ్యయం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత భైంసా మండలంలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టును సందర్శించి, ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ, తాగునీటి సరఫరా అంశాలను సమీక్షించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నీటి నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. చివరగా భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయంలో పలు అభివృద్ధి అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ పర్యటనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, జిల్లా విద్యాధికారి భోజన్న, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్, నీటిపారుదల శాఖల ఈఈలు సందీప్, అనిల్, తహసీల్దార్లు శ్రీకాంత్, శశిభూషణ్, ఎంపీడీఓ పుష్పలత, ఎంపీఓ తిరుపతి రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుండెపోటుతో కారోబరి మృతి

సారంగాపూర్, జులై 18, ప్రభాతవార్త:



మండలంలోని వైకుంఠాపురం గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కారోబరి చుక్కబొట్ల రాజేశ్వర్(48) శనివారం గుండెపోటుతో మరణించారు. ఉదయం 11.00 గంటల సమయంలో ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో, చికిత్స నిమిత్తం నిర్మల్ పట్టణానికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే ఆసుపత్రికి తీసుకెళ్లే లోపే ఆయన నివాసంలోనే కన్నుమూశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండే కారోబరి రాజేశ్వర్ అకస్మాత్తుగా మరణించడంతో వైకుంఠాపురం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతి పట్ల గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తమ గాఢ సానుభూతిని తెలియజేశారు.


# వర్షాభావ పరిస్థితులపై స్పష్టమైన ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి

**- అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశం**

**- సోమవారం నాటి సమీక్షకు పూర్తి నివేదికలతో రావాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్, జులై 18, ప్రభాతవార్త:**

వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు స్పష్టమైన ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు ఆదేశించారు. శనివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి, అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రవ్యాప్తంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున, అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని వివరించారు. రైతులు పంట మార్పిడి విధానాలు అనుసరించేలా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని, తక్కువ నీటి లభ్యతతో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు, ప్రత్యేక అధికారులు నిర్వహించబోయే సమీక్షా సమావేశాలలో ఎల్‌నినో, వర్షపాతం, వ్యవసాయం, తాగునీరు, శాఖల వారీ ప్రణాళికల సమగ్ర నివేదికలతో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. మంత్రి సమీక్షకు సన్నద్ధం కావాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రాజిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. అనంతరం ఆయన జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. ఈ నెల 20న ఉట్నూరులో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రత్యేక అధికారి ఇలంబర్తి అధ్యక్షతన నిర్వహించబోయే ఉన్నత స్థాయి సమీక్షా సమావేశానికి అధికారులు తగిన నివేదికలతో హాజరుకావాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులపై ఏ ఒక్క శాఖ అలసత్వం వహించకూడదన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, డీఎంహెచ్ఓ రాజేందర్, డీపీఓ శ్రీనివాస్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, డీఆర్డీఓ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సదస్సు

**యువతకు పోరాట పిలుపు**

**బెల్లంపల్లి, జూలై 18, ప్రభాతవార్త**

బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం (బిఆర్ఎస్వి), యువజన విభాగం ఆధ్వర్యంలో శనివారం సరూర్‌నగర్‌లో ఘనంగా నిర్వహించిన యువ సంగ్రామ సదస్సులో బిఆర్ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ పాల్గొన్నారు. యువత భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా బడికల శ్రావణ్ మాట్లాడుతూ యువత మేల్కొంటే మార్పు తప్పదు... యువ సంగ్రామమే భవిష్యత్తుకు బాట అని స్పష్టం చేశారు. నిరుద్యోగ యువత గళాన్ని వినిపించే వేదికగా ఈ సదస్సు నిలుస్తుందని, ఉద్యోగం యువత హక్కు అని, పోరాటం వారి బాధ్యత అని, యువశక్తి ఏకమైతే అన్యాయ పాలనకు ముగింపు ఖాయం అని అన్నారు. వాగ్దానాలు కాకుండా ఉద్యోగాలే కావాలని యువత డిమాండ్ చేయాలని పిలుపునిచ్చారు. యువత అడుగులు ఉద్యమంగా మారితే మార్పు అనివార్యమని, తెలంగాణ యువత ఆత్మగౌరవం కోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. యువతా.. కదం తొక్కుదాం.. పోరాడి మన హక్కులు సాధించుకుందాం అంటూ ఆయన యువతకు ఉద్యమ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు, కార్యదర్శులు మేకల విద్యాసాగర్, చటారి దశరథ్, అలాగే మంచిర్యాల జిల్లా నాయకులు దార అరుణ్ రిషి, సందీప్, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.




# గ్రామాల్లో సర్వే ప్రక్రియ తీరును పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**సారంగాపూర్, జులై 18, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని బోరిగాం, యాకర్ పల్లి, సారంగాపూర్, స్వర్ణ గ్రామాలలో శనివారం తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహర్ బిన్ హందాని, నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లోని వీఎల్ఓ, బీఎల్ఓలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, కొనసాగుతున్న సర్వే ప్రక్రియ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా యాకర్ పల్లి గ్రామంలో సర్వేను వంద శాతం విజయవంతంగా పూర్తి చేసిన బీఎల్ఓలను నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహర్ బిన్ హందాని సర్వే విధులకు సంబంధించి సిబ్బందికి ఉన్న పలు సందేహాలను నివృత్తి చేస్తూ తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు నమోదయ్యేలా బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు అట్ల పోతారెడ్డి, కాంగ్రెస్ ముఖ్య నాయకులు నవీన్ రెడ్డి, గాజుల రాజు, సాక్‌పల్లి సురేందర్, మండల పరిధిలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.





గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నీరజ్ కుమార్

# జలసిర్థి గ్రామ సభ సమావేశం నిర్వహణ

**- జలమే జీవనాధారం**

**- ప్రతి నీటి బొట్టును కాపాడుకుందాం**

**- భూగర్భ జలాల సంరక్షణపై ప్రజలకు అవగాహన: ఎంపీడీఓ నీరజ్ కుమార్**

**భైంసా, జులై 18, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని వానల్పాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ జలసిర్థి కార్యక్రమానికి సంబంధించిన గ్రామ సభ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో భైంసా ఎంపీడీఓ నీరజ్ కుమార్, సర్పంచ్ ఎంపెల్లి నాగలక్ష్మి వినోద్, ఉప సర్పంచ్ సాయరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణ, గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లు నిర్మించుకుని భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామ ప్రజల అభిప్రాయాలను సేకరించి, జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, రైతుల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. "జలమే జీవనాధారం – ప్రతి నీటి బొట్టును కాపాడుకుందాం" అనే సందేశంతో ఈ సమావేశం ముగిసింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాయత్రి, ఏఈఓ సుప్రియ, గ్రామ పెద్దలు, రైతులు, యువకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన భైంసా మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి ఘన సన్మానం


**- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**- మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి**

**- పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు**

**భైంసా, జులై 18, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని కుంభీ గ్రామానికి చెందిన సిందే గజానంద్ భైంసా మండల నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం ముథోల్ మాజీ శాసనసభ్యుడు జి. విఠల్ రెడ్డి ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. సిందే గజానంద్‌కు మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్‌కు భైంసా మండలం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా చేరవేస్తూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని నూతన అధ్యక్షుడికి సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సూర్యం రెడ్డి, దేవేందర్ రెడ్డి, రాందాస్, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శాలువాతో సత్కరిస్తున్న ముథోల్ మాజీ శాసనసభ్యుడు జి. విఠల్ రెడ్డి, చిత్రంలో మాజీ జడ్పీటీసీ సూర్యం రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

## ఉద్యాన శాఖలో అమలవుతున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్, టౌన్, జూలై 18: ప్రభాతవార్త :**

ఉద్యాన శాఖలో అమలవుతున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని లాభదాయక పంటలు సాగుచేసుకోవాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల అధికారి వై.ఎం. నదీమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సుమారు 4.60 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుండగా అందులో 85 శాతం వ్యవసాయ భూమి వర్షాధారంగా ఉందన్నారు. ఎల్నినో ప్రభావంతో జిల్లాలో ఇప్పటి వరకు 28 శాతంతో తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రత్యామ్నాయ పంటల వైపుకు మళ్లాలని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు సంప్రదాయ పంటలతో పాటు టమాట, వంకాయ, మిర్చి, బెండ, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటి కూరగాయలతో పాటు మామిడి, ఆరెంజ్, జామ, బత్తాయి వంటి ఉద్యాన పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. పథకం కింద సాధారణ రైతులకు 50 శాతం వరకు రాయితీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, చిన్న, సన్నకారు రైతులకు 80 శాతం, ఇతర అర్హులైన రైతులకు 70-75 శాతం వరకు సబ్సిడీ అందుతుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు తమ ఆధార్, పాస్‌బుక్, బ్యాంకు ఖాతా వివరాలతో జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని డీహెచ్ఎస్ఓ కోరారు.



## బోనాల జాతరకు డా. కొత్తపల్లి దంపతులకు ఆహ్వానం

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 18, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని సర్ సిల్క్ ఏరియాలో వెలసిన శ్రీ కట్ట మైసమ్మ తల్లి బోనాల జాతర మహోత్సవాలకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత, ప్రముఖ నాయకుడు డా. కొత్తపల్లి శ్రీనివాస్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జాతరకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ కచ్చకాయల జ్యోతి పాల్గొన్నారు. జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి.

## చింతకుంటలో సమగ్ర భూ సర్వేపై అవగాహన సదస్సు

**సిర్పూర్(టి), జూలై 18, ప్రభాతవార్త:**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర భూ రీసర్వే కార్యక్రమంపై చింతకుంట గ్రామపంచాయతీలో శనివారం సర్పంచ్ అజ్మీర చత్రునాయక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చింతకుంట, హీరాపూర్, చుంచుపల్లి రెవెన్యూ శివారులకు సంబంధించిన రైతులు, గ్రామస్తులకు భూ సర్వే ప్రక్రియపై అధికారులు అవగాహన కల్పించారు. సర్వే శాఖ సహాయ సంచాలకుడు వినయ్ కుమార్ మాట్లాడుతూ, దాదాపు 90 సంవత్సరాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర భూ సర్వే చేపడుతోందని తెలిపారు. ఈ సర్వే ద్వారా భూవివాదాలు, హద్దుల సమస్యలు, గట్టు పంచాయతీలు, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. సర్వే పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రైతులు పూర్తి సహకారం అందించాలని కోరారు. సిర్పూర్(టి) తహసీల్దార్ రెహముద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం రైతుల భూ హక్కుల పరిరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి రైతు సర్వే సమయంలో అవసరమైన పత్రాలతో హాజరై అధికారులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి షాలిని, ఉపసర్పంచ్ మోహన్, సింగిల్ విండో డైరెక్టర్లు మహేశ్వర్, పోచనాయక్, మండల సర్వేయర్ ప్రసాద్, రెవెన్యూ అధికారులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# మురికి నీటిలో మునిగిన పాఠశాల దారి..

### జారిపడుతున్న విద్యార్థులు, పాదచారులు, వాహనదారులు - ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి

**మంచిర్యాల, జులై 18, ప్రభాతవార్త**



రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరు బురదగా మారిన రోడ్డు

మంచిర్యాల నగర కార్పొరేషన్ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో ఉన్న బాలికల ప్రభుత్వ పాఠశాల ముందు రహదారిపై మురికి నీరు నిరంతరం ప్రవహిస్తూ ప్రమాదకర పరిస్థితులను సృష్టిస్తోంది. జిల్లాలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ప్రతిరోజూ మార్కెట్‌కు వచ్చే ప్రజలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థినులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై మురికి నీరు నిల్వ ఉండటంతో రోడ్డు జారుడుగా మారి నడిచే వారు తరచూ జారిపడుతున్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు సైతం అదుపు తప్పి కిందపడిన సంఘటనలు ఇప్పటికే పలుమార్లు చోటుచేసుకున్నాయని స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగకపోయినా, పలువురు స్వల్ప గాయాలతో బయటపడినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాల ప్రారంభం, ముగింపు వేళల్లో చిన్నారులు మురికి నీటిని దాటుకుంటూ వెళ్లాల్సి రావడం తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. మార్కెట్‌కు వచ్చే మహిళలు, వృద్ధులు, వ్యాపారులు కూడా ఇదే సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. మురికి నీటి కారణంగా దుర్వాసన వెదజల్లడంతో పాటు అపరిశుభ్ర వాతావరణం నెలకొని ప్రజారోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు వాపోతున్నారు. పెద్ద ప్రమాదం సంభవించకముందే నగర కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి మురికి నీటి ప్రవాహాన్ని అరికట్టి, రహదారిని మరమ్మతు చేసి సురక్షిత రాకపోకలకు అనుకూలంగా తీర్చిదిద్దాలని ప్రజలు, తల్లిదండ్రులు, వ్యాపారులు, స్థానికులు కోరుతున్నారు.

## సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సు

**బెజ్జూర్, జూలై 17, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండలంలోని నాగేపల్లి, సుస్మీర్ రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే కొరకు సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సులను తహసిల్దార్ రామ్మోహన్రావు నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో మండల సర్వేయర్ రోవర్ యంత్రం ద్వారా రీ సర్వే చేస్తారని తద్వారా అక్షాంశాలు, రేఖాంశాలతో కూడిన సర్వే మ్యాప్ లో తయారు చేస్తారని అన్నారు. దీనివల్ల భవిష్యత్తులో భూ తగాదాలకు ఆస్కారం ఉండదని అన్నారు. సర్వే సమయంలో రైతుల వద్ద ఉన్న పట్టాదారు పాస్ పుస్తకం కానీ సంబంధిత భూ పత్రాలతో మోకాపై హాజరు కావాలని సూచించారు. వారు సాగు చేస్తున్న భూమి హద్దులు సర్వేయర్ కు చూపించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవీందర్, సర్వేయర్ శ్రీకాంత్, సర్పంచులు కొడిపె శంకర్, తొర్రెం చంద్రకళ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**తాండూర్, జులాయి 18, ప్రభాతవార్త :**

మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ గాంధీ నగర్ లో శనివారం సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ ఆకుల వెంకటేష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రూ.5 లక్షల రూపాయల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్డు పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ లక్ష్మణ్, మాదారం ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు మెంబర్ జంబోజుల ప్రవీణ్, నాయకులు పుట్ట శ్రీనివాస్, డేగ స్వామి, పుప్పాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ వెంకటేష్

## ఈ నెల 20వ తేదీన ప్రజావాణి రద్దు

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జూలై 18, ప్రభాతవార్త**

ఉట్నూర్‌లోని పిఎంఆర్‌సి సమావేశ మందిరంలో ఈ నెల 20వ తేదీన జిల్లా స్థాయి అధికారులతో ఉమ్మడి జిల్లా మంత్రి, రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించనున్నందున 20వ తేదీ సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని తెలిపారు.



## తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

**కాగజ్‌నగర్, జూలై 18 ప్రభాతవార్త :**

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, మైలారం మీదుగా ఎల్లంపల్లి ప్రాజెక్టుతో అనుసంధానం చేయాలని తెలంగాణ జల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ నైనాల గోవర్ధన్ డిమాండ్ చేశారు. శనివారం కాగజ్‌నగర్‌లోని రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో తలెత్తిన సాంకేతిక సమస్యల నేపథ్యంలో రాష్ట్రంలో సాగునీటి పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఎల్నినో ప్రభావంతో కరువు తీవ్రత పెరిగి, వరి సాగు తగ్గడంతో పాటు మెట్ట ప్రాంతాల్లో విత్తిన పంటలు నీటి కొరతతో ఎండిపోతున్నాయని అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు పూర్తి కాలేదని, మరోవైపు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం కూడా ముందుకు సాగలేదని ఆయన ఆరోపించారు. ఈ పరిస్థితులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని వెంటనే నిర్మించి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిపాదించిన విధంగా ఎల్లంపల్లితో అనుసంధానం చేయాలని కోరారు. సాగునీటి సమస్యను రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర నాయకులు కలివేణి శంకర్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు టి. శ్రీనివాస్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ప్రకాష్, లాల్ కుమార్, శంకర్, మంగ, ఎండీ చాంద్ పాషా, జైపాల్ సింగ్, రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, బ్రహ్మానందం, వేణు, పిట్టల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవ మైనారిటీలకు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తులు ఆహ్వానం

**- కుట్టు మిషన్లు, చిన్న వ్యాపారాలు, మోటార్ బైక్‌ల కొనుగోలుకు రుణాలు దరఖాస్తుకు చివరి తేదీ జూలై 31: జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి. దయానంద్**

**నిర్మల్, జులై 18, ప్రభాతవార్త:**

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాల కింద రుణాల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి టి. దయానంద్ తెలిపారు. కుట్టు మిషన్లు, చిన్న వ్యాపారాలు, ఈబైక్, ఈస్కూటీ, మోటార్ బైక్ కొనుగోలు కొరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన క్రైస్తవ మైనారిటీ అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5.00 గంటలలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను తెలంగాణ రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా అందజేయాల్సి ఉంటుంది.

**అర్హత వివరాలు:** దరఖాస్తుదారులు తప్పనిసరిగా క్రైస్తవ మైనారిటీకి చెందినవారై ఉండాలి. స్వయం ఉపాధి, చిన్న వ్యాపార రుణాలకు దరఖాస్తు చేసుకునే వారి వయసు 21 ఏళ్ల నుండి 55 ఏళ్ల మధ్య ఉండాలి. ఈబైక్, ఈస్కూటీ, మోటార్ బైక్ రుణాలకు దరఖాస్తు చేసుకునే వారి వయసు 21 ఏళ్ల నుండి 50 ఏళ్ల మధ్య ఉండాలని స్పష్టం చేశారు. ఆదాయ పరిమితి ప్రకారం గ్రామీణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల లోపు ఉన్నవారు ఈ రుణాలకు అర్హులని వివరించారు. అదనపు సమాచారం కొరకు నిర్మల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని గది సంఖ్య ఎఫ్3 లో ఉన్న జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ కార్యాలయాన్ని సంప్రదించాలని, లేదా పని దినాల్లో దూరవాణి సంఖ్య ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని అధికారి తెలిపారు.

## ఘనంగా అన్నాభావు సాఠే వర్ధంతి

**- చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు**

**- అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు**

**- మాజీ జడ్పీటీసీ ఉత్తం భలేరావు**

**భైంసా, జులై 18, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సామాజిక విప్లవకారుడు అన్నాభావు సాఠే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిర్మల్ జిల్లా తానూర్ మండల కేంద్రంలో శనివారం మహాకవి డాక్టర్ అన్నాభావు సాఠే వర్ధంతి వేడుకలు జరిగాయి. మాజీ జడ్పీటీసీ ఉత్తం భలేరావు ఆధ్వర్యంలో, తానూర్ కమిటీ సభ్యుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులందరూ కలిసి అన్నాభావు సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ ఉత్తం భలేరావు మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, కార్మికుల హక్కుల కోసం అన్నాభావు సాఠే చేసిన కృషి అనన్యసామాన్యమైనదని కొనియాడారు. ఆయన తన రచనల ద్వారా సమాజంలో చైతన్యాన్ని నింపారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తానూర్ కమిటీ సభ్యులు ఉద్గిరే దత్తు, బైల్కర్ సురేష్, వాగ్మరే సాయజీ, స్థానిక నాయకులు వాగ్మరే ప్రసాద్, వాగ్మరే అమృత్, గైక్వాడ్ రవి, గైక్వాడ్ నాగేష్, వాగ్మేరే మణికంత, వాగ్మారే పోతన్, బోయవార్ సాహెబు, గైక్వాడ్ సాయినాథ్ ఝురి, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ జడ్పీటీసీ ఉత్తం భలేరావు, కమిటీ సభ్యులు

# చినుకు పడితే చిత్తడే..

**- క్యాతనపల్లి, గొర్లపల్లిలో ప్రజల గోడు - బురదమయమైన రహదారులతో రాకపోకలకు ఇబ్బందులు - డ్రైనేజీ లేక నిల్వ నీటితో దోమల బెడద - వెంటనే చర్యలు కోరుతున్న గ్రామస్థులు**

**వేమనపల్లి, జూలై 18, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలంలోని క్యాతనపల్లి, గొర్లపల్లి గ్రామాల్లో మౌలిక వసతుల సమస్యలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. క్యాతనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పోచమ్మవాడలో కొద్దిపాటి వర్షానికే రహదారులు బురదమయంగా మారుతుండగా, గొర్లపల్లి గ్రామపంచాయతీ 2వ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షపు నీరు నిల్వ ఉండి దోమల బెడద పెరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గొర్లపల్లిలో నిల్వ ఉన్న నీరు



క్యాతనపల్లిలో బురదమయమైన రోడ్డు

క్యాతనపల్లి పోచమ్మవాడలో రోడ్డంతా బురద, గుంతలతో నిండిపోవడంతో పాదచారులు, విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రహదారిపై నీరు నిలిచి ప్రయాణం ప్రమాదకరంగా మారుతోందని, ఏళ్లుగా ఈ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇక గొర్లపల్లి 2వ వార్డులో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని లేదా నిల్వ నీరు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్వేచ్ఛ యువజన సంఘం గత రెండు గ్రామసభల్లో సూచించినప్పటికీ చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. గ్రామపంచాయతీకి నిధులు ఉన్నప్పటికీ ప్రజలకు అత్యవసరమైన డ్రైనేజీ, పారిశుద్ధ్య పనులను విస్మరించి ఇతర పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పలు వార్డుల్లో దోమల బెడద పెరిగినా శానిటేషన్ చర్యలు కూడా సక్రమంగా చేపట్టడం లేదని విమర్శించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని క్యాతనపల్లిలో రహదారుల మరమ్మతులు, గొర్లపల్లిలో డ్రైనేజీ నిర్మాణం, నిల్వ నీటి తొలగింపు, పారిశుద్ధ్య చర్యలు వెంటనే చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని సంబంధిత అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.



**వర్షాభావానికి చాకచక్యమైన ప్రత్యామ్నాయం..**

## రైతులకు మార్గదర్శకంగా అవగాహన కార్యక్రమం

**బెల్లంపల్లి, జూలై 18, ప్రభాతవార్త**

ప్రకృతి మార్పుల ప్రభావం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు కొత్త ఆలోచనలతో ముందుకు సాగాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతుండటంతో, రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు వేయాలని గుర్జాల వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) గౌసియా బేగం పిలుపునిచ్చారు. శనివారం రోజున బెల్లంపల్లి మండలంలోని రంగంపేట గ్రామ శివారులో నిర్వహించిన అవగాహన కార్యక్రమం రైతుల్లో కొత్త ఆశలను నింపింది. ఈ కార్యక్రమంలో ఆమె రైతులతో నేరుగా మమేకమై, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను వివరించి, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాలను మార్చుకోవాల్సిన అవసరాన్ని స్పష్టంగా తెలియజేశారు. వర్షాలు తగ్గినా రైతుల ఆశలు తగ్గకూడదు అని ఆమె స్పష్టం చేస్తూ, తక్కువ నీటితోనూ మంచి దిగుబడిని ఇచ్చే పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా మినుములు, పెసర, కంది వంటి పప్పుధాన్యాలు, అలాగే జొన్న, రాగులు వంటి సిరిధాన్యాలు, కూరగాయల పంటలు రైతులకు భద్రమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తాయని వివరించారు. అదేవిధంగా, పంట వైవిధ్యం ద్వారా రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా, ప్రమాదాన్ని విభజించుకోవచ్చని చెప్పారు. ఇది రైతుల ఆదాయాన్ని స్థిరపరచడమే కాకుండా, భూమి సారాన్ని కాపాడటంలో కూడా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం కేవలం పంటల ఎంపికకు మాత్రమే పరిమితం కాకుండా, రైతుల్లో సాంకేతిక దృక్పథాన్ని పెంపొందించే దిశగా సాగింది. వాతావరణ మార్పులు ఎంతటి సవాలు విసిరినా, సరైన ప్రణాళికతో రైతులు దాన్ని అవకాశంగా మలుచుకోవచ్చని ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమైంది. ఈ కార్యక్రమంలో రంగంపేట సర్పంచ్ శ్యామలత, గ్రామ రైతులు ఉత్సాహంగా పాల్గొని, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమం చివరలో రైతులు తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు, కొత్త పద్ధతులను అనుసరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

## గోపాల్‌పేట్‌లో జలసిరుల సంరక్షణపై గ్రామసభ

**- ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు**

**- ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లతో భూగర్భ జలాలు పెంచుకోవాలి: అదనపు కలెక్టర్**

**సారంగాపూర్, జులై 18, ప్రభాతవార్త:**

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశాల మేరకు ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు గ్రామాలలో జలసిరి కార్యక్రమంపై రైతులకు, ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించనున్నారు. ఇందులో భాగంగా శనివారం సారంగాపూర్ మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో గ్రామ సర్పంచ్ మంతెన గంగారెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు సోనాపూర్ గ్రామ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ గ్రామ సభకు జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు ప్రత్యేక అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎల్‌నీనో ప్రభావం వల్ల ఏర్పడిన వాతావరణ మార్పులతో సకాలంలో వర్షాలు కురవడం లేదని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు గ్రామాల్లో ఇంకుడు గుంతలు, వ్యవసాయ చేనులలో చిన్నపాటి ఫామ్ పాండ్లు (నీటి కుంటలు) నిర్మించుకోవాలని సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఒడిసిపట్టడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల పరిసరాలలో అదనపు కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం ప్రత్యేక ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ లక్ష్మణ్, డీపీఓ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఏపీఎం మాధురి, ఏపీఓ మంజుల, ఏఈఓ తిరుపతి, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, డ్వాక్రా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, చిత్రంలో సర్పంచ్ మంతెన గంగారెడ్డి, అధికారులు

# తానూర్ కేజీబీవీలో అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాల ప్రారంభోత్సవం

- ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

- రూ.98.12 లక్షల నాబార్డ్ నిధులతో పాఠశాల అభివృద్ధి.. విద్యార్థినులకు యూనిఫాంల పంపిణీ



అదనపు తరగతి గదులను, మౌలిక సదుపాయాలను ప్రారంభిస్తున్న ముధోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్

**భైంసా, జులై 18, ప్రభాతవార్త:**

తానూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో నాబార్డ్ నిధులతో నిర్మించిన మొదటి అంతస్తులోని అదనపు తరగతి గదులను, అదనపు మౌలిక సదుపాయాలను ముధోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్ శనివారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.56 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను, అలాగే రూ.42.12 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అదనపు మౌలిక సదుపాయాలను ఆయన ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థినులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం, సౌకర్యాలు కల్పించేందుకు ఈ అభివృద్ధి పనులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి ఆదిలాబాద్‌లో ప్రభుత్వ సమీక్ష

- ఈ నెల 20న ఉట్నూరులో మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన సమావేశం

- నాలుగు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష

**నిర్మల్, జులై 18, ప్రభాతవార్త:**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ముందస్తుగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధతను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 20న ఉట్నూరులో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ సమావేశంలో ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారు. ఎల్‌నినో కారణంగా వర్షాలు తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర రంగాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై మంత్రి జూపల్లి సమగ్రంగా చర్చించనున్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి వినియోగంలో పొదుపు, పశుగ్రాస సరఫరా, ఉపాధి అవకాశాల కల్పనకు సంబంధించి జిల్లాల వారీగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించనున్నారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయం, ఉద్యానవనం, మార్క్‌ఫెడ్, సాగునీటి శాఖ, మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయతీరాజ్, టీజీఎన్‌పీడీసీఎల్, అటవీ, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్య, మహిళా, శిశు సంక్షేమ శాఖల అధికారులు తమ తమ శాఖల సన్నద్ధత నివేదికలను సమర్పించనున్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం, గ్రామ స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలపై కూడా ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఎల్‌నినో ప్రభావం రైతులపై పడకుండా చూడాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అవసరమైన చోట్ల నిధులు, సిబ్బందిని సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు.

# నిర్మల్ నియోజకవర్గంలో 33 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రూ.11.80 లక్షల ఆర్థిక సహాయం అందజేత - పేదలకు వైద్య సహాయం అందించడంలో

సీఎం రిలీఫ్ ఫండ్ వరం : కూచాడి శ్రీహరి రావు

**నిర్మల్, జులై 18, ప్రభాతవార్త:**



పేదలకు వైద్య సహాయం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) వరంలా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు పేర్కొన్నారు. శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్మల్ నియోజకవర్గానికి చెందిన 33 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.11 లక్షల 80 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో వైద్య రంగాన్ని బలోపేతం చేస్తోందని తెలిపారు. పేదలు వైద్య ఖర్చుల భారంతో ఇబ్బంది పడకుండా సకాలంలో ఆర్థిక సహాయం అందించేందుకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తోందని చెప్పారు. అవసరమైన సమయంలో అర్హులైన బాధితులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హాది, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గాజుల రవికుమార్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాథోడ్ సంతోష్, నరేష్ రెడ్డి, మొహియుద్దీన్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బెల్లంపల్లి సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే వినోద్

**బెల్లంపల్లి, జూలై 18, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వ దృష్టి సారించేందుకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి తన కుటుంబ సభ్యులతో కలిసి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు కూడా పాల్గొన్నారు. ఈ భేటీలో బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సమగ్రంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పట్టణంలోని ప్రధాన మరియు అంతర్గత రహదారుల విస్తరణ, మురుగు కాలువల నిర్మాణం, పాత డ్రైనేజ్ వ్యవస్థ పునరుద్ధరణ వంటి కీలక అంశాలను ప్రస్తావించారు. అదేవిధంగా అన్ని వార్డుల్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద తగిన నిధులు మంజూరు చేయాలని కోరారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకురావడం, నిపుణ వైద్యులను నియమించడం, సరిపడా సిబ్బంది భర్తీ చేయడం వంటి అంశాలను కూడా వినతిపత్రంలో ప్రస్తావించారు. సింగరేణి ప్రాంతంలో సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ప్రజలకు 76 జీఓ ప్రకారం ఇళ్ల పట్టాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇక స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బెల్లంపల్లిలో అంబేద్కర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం

**బెల్లంపల్లి, జూలై 18, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మండలం బుధకూర్ధు గ్రామంలో ఈరోజు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విలువైన సూచనలు అందించబడినాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పు చేసుకోవాలని బెల్లంపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి చొప్పదండి తిరుపతి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి క్లస్టర్ పరిధిలోని చాకెపల్లి, చంద్రవెల్లి, అంకుశం, కన్నాల, బుధకాలన్ గ్రామాల శివార్లలో గత వారం రోజులుగా రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా మినుములు, పెసర, కంది, జొన్న, రాగులు వంటి తక్కువ నీటితో పెరిగే పంటలతో పాటు కూరగాయల సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని, పంట వైవిధ్యం ద్వారా రైతుల ఆదాయం పెరగడమే కాకుండా భూసారాన్ని కూడా కాపాడుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో బుధకూర్ధు గ్రామ సర్పంచ్ వెంబడి రాణి సురేష్, గ్రామ రైతులు పాల్గొని అధికారుల సూచనలు శ్రద్ధగా విన్నారు. రైతులు ఈ సూచనలను ఆచరణలో పెట్టి వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవాలని అధికారులు కోరారు.

